క్లుప్తంగా

పట్టణ అభివృద్ధికి సహకరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. మున్సిపాలిటీలోని 14వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. ప్రజలు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పట్టణంలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కోటేశ్వరరావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ కార్డున్న ప్రతి కూలీకి పని కల్పించాలి

హనుమంతునిపాడు: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు జాబ్ కార్డున్న ప్రతి కూలీకి పని లేదన కుండా కల్పించాలని ఏపీవో వినయ్ పేర్కొన్నారు. గురువారం ఉపాధి టీఏలకు, ఎఫ్ఏలకు ఉపాధి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం కూలీల మస్టర్లలో జాప్యం జరగకుండా అందించాలన్నారు. జాబ్ కార్డున్న కూలీకి పని లేదనకుండా కల్పించాలి.. పని కావాల్సిన కూలీకి ముందుగా డిమాండ్ నోటీసు ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో హాజరు శాతం తీయాలన్నారు. జాబ్ కార్డులు లేని కూలీలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీఏలు షేక్ రహంతుల్లా, దివ్యవాణి, సుబ్బారెడ్డి, తదితరులు ఉన్నారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

టంగుటూరు: పాత కక్షలు మనసులో పెట్టుకొని దాడి చేసిన ఘటన మండలంలోని మర్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు కొమ్ము మరియదాసు వివరాల మేరకు.. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కాలనీ నుంచి సెంటర్ ప్రాంతంలోకి నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా అక్కడ వేచి ఉన్న రాయపాటి సుధాకర్ నా దగ్గరికి వచ్చి అకారణంగా నిందిస్తూ గొడవపడి రోకలిబండతో తలపై దాడి చేశారన్నారు. అనంతరం సుధాకర్ తండ్రి శ్రీను కూడా వచ్చి దాడి చేశారని తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 అంబుస్స్‌లో ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు.

12న మండల సర్వసభ్య సమావేశం

కందుకూరు రూరల్: కందుకూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ హాలులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.రత్నజ్యోతి తెలిపారు. ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన జరిగే సమావేశానికి ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంలో హాజరు కావాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన

కందుకూరు రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘాల (జీసీజీటీఏ, జీసీటీఏ) రాష్ట్ర పిలుపులో భాగంగా కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గురువారం నల్ల బ్యాడ్జిలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో బదిలీలు నిర్వహించారని, తమ విభాగంలో మాత్రమే బదిలీలు నిర్వహించలేదని, తమకు కూడా వెంటనే బదిలీలు నిర్వహించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. అదే విధంగా గత ప్రభుత్వం ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వ కళాశాలల్లో నియమించిన జీఓ నెంబర్ 42ను రద్దు చేయాలని, తమను దేశంలో 26 రాష్ట్రాల్లో ఉన్న విధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్లుగా రీడిజిగ్నేట్ చేయాలన్నారు. ఇతర సమస్యలు వెంటనే చర్చించి పరిష్కారం చేయాలని అధ్యాపకులు డిమాండ్ చేశారు. ముందుగా నల్ల బ్యాడ్జిలతో భోజన విరామ సమయంలో కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 18వ తేదీన విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో రాష్ట్ర వ్యాప్త మహా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అధ్యాపక సంఘ నాయకులు పి.రాజగోపాల్, ఎన్.తిరుపతిస్వామి, బి.కమలబాబు, ఎన్వీ శ్రీహరి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

కందుకూరు రూరల్: రైతులు భూసార పరీక్షలు కచ్చితంగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్కే అబ్దుల్ రహీం అన్నారు. మండలంలోని జి.మేకపాడులో ఆత్మ పథకం కింద భూసార పరిరక్షణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో పంటలు వేసుకునేందుకు పొలంలో మట్టి తీసుకొని పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ భూసార పరీక్షలు, పచ్చిరొట్ట పైర్ల సాగు, వాటి ప్రాముఖ్యత వివరించారు. కంది పైరులో విత్తన శుద్ధి చేసుకునే పద్ధతులు చేసి చూపించారు.

ఆలకించరు.. పట్టించుకోరు!

- అభివృద్ధికి నోచుకోని కనిగిరి-తుమ్మకుంట రోడ్డు
- ప్రజలకు శాపంగా మారిన వైనం
- పట్టించుకోని కూటమి నేతలు



అధ్వానంగా కనిగిరి-తుమ్మగుంట రోడ్డు



రోడ్డులో కష్టంగా సైకిల్ తొక్కుతున్న దృశ్యం

కనిగిరిరూరల్: నేతలెందరూ మారినా.. ఈ రోడ్డు తలరాత మారలేదు.. కనిగిరి పట్టణానికి కూత వేటు దూరంలో ప్రధాన రహదారికి పక్కనే ఉండి మూడు గ్రామాలకు సౌకర్యంతో పాటు కనిగిరి-కంభం రోడ్డుకు లింకు రోడ్డుగా ఉన్న కనిగిరి తుమ్మకుంట రోడ్డు ప్రభుత్వ, పాలకుల తీరును వెక్కిరిస్తోంది. కారణాలు ఏమైనా కనిగిరి-పొదిలి రహదారిలోని కనిగిరి టు తుమ్మగుంట వయా కాశీపురం, గడ్డమీద పల్లి రోడ్డు ఎన్నో ఏళ్లనుంచి అభివృద్ధికి నోచుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో సుమారు రూ కోటితో ఈ రోడ్డును కొంత దూరం తారు రోడ్డుగా మార్చేందుకు శంకుస్థాపన చేశారు. నిధుల శాపమా ? గుత్తేదారుని లోపమా కారణాలు ఏమైనా రోడ్డు అభివృద్ధి మూడు అడుగులు ముందుకు పది అడుగులు వెనిక్కి అన్న చందాన మారింది.

ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో ఉన్నా..

ఈ రోడ్డు మార్గంలోని కొంత భాగం ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో ఉంది. ప్రధానంగా కాశీపురం పంచాయతీ అంతా వీలిన మున్సిపాలిటీలో ఉంటుంది. సుమారు 2 వేలకు పైగా జనాభ కల్గిన గ్రామం. విద్యార్థులు, ప్రజలు నిత్యం కనిగిరికి రాకపోకలు సాగిస్తుంటారు. కనిగిరి పొదిలి ప్రధాన రహదారి ఎక్కాలంటే ఒకటిన్నర కిలో మీటర్ వస్తే చాలు. అయితే ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు పడే అవస్థలు వర్ణణాతీతం.

లోపం ఏవరిదైనా.. ప్రజలకు శాపం..

గత టీడీపీ హయంలో ఈ రోడ్డు నిర్మాణంకు శ్రీకారం చుట్టారు. నిధుల లేమినా ? కాంట్రాక్టర్ లోపమా? తెలియదు కానీ దాదాపు పదేళ్లుగా ముందు అడగు పడలేదు. మధ్యలో తారు రోడ్డుగా మార్చేందుకు కంకర సైజు రాళ్లు పరిచారు. కానీ రోడ్డు పూర్తి చేయలేదు. దీంతో గులక రాళ్లలో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. సైకిల్‌లు, మోటార్ బైక్‌లు, ఆటోల్లో రావాలంటే వాహనదారులు పడే అవస్థలు వర్ణణాతీతం. టైర్లు పగిలి పోతున్నాయి. ఇక వర్షం పడితే నడక నరక యాతనే. గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం.. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పి డబ్బా కొడుతున్న కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాదైనా పట్టించుకోలేదు. దీంతో మూడు గ్రామాల ప్రజలు, విద్యార్థులు ప్రభుత్వ తీరుపై శాపనార్థాలు పెడుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి తమ గ్రామాల రోడ్డు రోడ్డుకు మోక్షం కల్పించి.. తారు రోడ్డుగా మార్చి సమస్యను తీర్చాలని వేడుకుంటున్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక దృష్టి



ఉప్పలపాడులో వర్మీ కంపోస్ట్ పిట్లను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): పంచాయతీల పరిధిలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల్లో సంపద సృష్టించడంపై సిబ్బంది ప్రత్యేకదృష్టి సారించాలని డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి కే.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉప్పలపాడు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా వర్మీ కంపోస్ట్ తయారు విధానాన్ని చూసి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో పీ-4 కుటుంబ అవసరాల గుర్తింపు సర్వేపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ ఎంవీ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పడిపోతున్న లోగ్రేడ్ పొగాకు ధర

- ఆందోళనలో రైతులు
- రెండు రోజులలో రూ.10 తగ్గిన కనిష్ట ధర



కొండపిలో వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి సునీల్ కుమార్



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో లో గ్రేడ్ పొగాకు ధర రోజు రోజుకు పడిపోతోంది. 2024-25 సీజన్‌కు సంబంధించి పొగాకు వేలాన్ని మార్చి 10వ తేదీన ప్రారంభించారు. ప్రారంభ రోజు పొగాకు గరిష్ట ధర కేజీ రూ 280, కనిష్ట ధర కేజీ రూ.260 నమోదైంది. తొమ్మిదో రౌండ్ పొగాకు వేలం చివరి దశకు వచ్చేసరికి కనిష్ట ధర రూ.150 నమోదైంది. రోజురోజుకూ పొగాకు ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలానికి తీసుకు వచ్చిన బేళ్లలో రోజుకు 200 పైగా బేళ్లను వ్యాపారులు తిరస్కరించడంతో బేళ్లను మరొకసారి వేలానికి తీసుకురావడానికి ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు బాగా పెరగడంతో అప్పులు చేసి పొగాకును సాగు చేశారు. వేలంలో ఆశించిన మద్దతు ధర పలికి పెట్టుబడి ఖర్చులు వస్తాయనే ఆశతో రైతులు ఉండగా, ధరలు తగ్గడంతో రైతులు ఆశలు అడియాశలవుతున్నాయి. పొగాకు బోర్డు అధికారులు బయ్యర్లతో సంప్రదింపులు జరిపి ఎక్కువ ధరకు పొగాకును కొనుగోలు చేయాలని రైతుల తరపున మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

కొన్ని బేళ్లకు మాత్రమే అధిక ధర.

వేలం నిర్వహణ కేంద్రంలో రైతులు తీసుకుని వచ్చే బేళ్లలో అతి తక్కువ బేళ్లకు మాత్రమే గరిష్ట ధర కేజీ రూ. 281 చూపిస్తున్నారు. వేలానికి తీసుకుని వచ్చిన మిగిలిన బేళ్లను రూ.150 నుంచి 240 వరకు కొనుగోలు చేస్తున్నారు.

పొగాకు కనిష్ట ధర కేజీ రూ 150..

స్థానిక పొగాకు వేలంకేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర కేజీ రూ.150 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ అనకర్లపూడి,పెరిదేపి, ముప్పరాజువారిపాలెం, మిట్టపాలెం గ్రామాలకు చెందిన రైతులు 873 బేళ్లను వేలానికి తీసుకొని వచ్చారు. అందులో 668 బేళ్లు కొనుగోలుయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 205 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 281, సరాసరి ధర కేజీ రూ 232.34గా నమోదైంది. వేలంలో 25 కంపెనీలు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

174 బేళ్ల తిరస్కరణ..

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 174 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 825 బేళ్లను వేలానికి తీసుకురాగా 651 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 174 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.281, కనిష్ట ధర కేజీ రూ.150, సరాసరి ధర కేజీ రూ.244.30గా నమోదైంది. వేలంలో 22 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కార్పియో, మోటార్ సైకిల్ ఢీ



చికిత్స పొందుతున్న వెంకటరత్నమ్మ

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న స్కార్పియోను వెనకాల వేగంగా వస్తున్న మోటారు సైకిల్ ఢీ కొన్న ఘటనలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన గురువారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కొండపి మండలం కే ఉప్పలపాడు గ్రామానికి చెందిన గుంజి వెంకటరత్నమ్మ, గుంజి ఆదిలక్ష్మి, గుంజి మణికంఠలు ముగ్గురు సింగరాయకొండ లో పెండ్లి కార్డులు పంపిణీ చేసేందుకు కె ఉప్పలపాడు నుంచి సింగరాయకొండకు మోటారు సైకిల్ పై వస్తున్నారు. ఈ క్రమంలో కందుకూరు ఫ్లెటైవర్ నుంచి ఊర్లోకి వస్తుండగా గురుకుల పాఠశాల సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న స్కార్పియో డ్రైవర్ ఎటువంటి హెచ్చరికలు పాటించకుండా అకస్మాత్తుగా మలుపు తిప్పడంతో వెనకాల వస్తున్న బైకు అదుపు తప్పి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో వెంకటరత్నమ్మకు తీవ్ర గాయాలు కాగా ఆమెను వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సంఘమిత్ర ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయని వివరించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

కనిగిరిరూరల్: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక డ్రైవ్ చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పి కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 3,4 వార్డుల సచివాలయాల పరిధిలోని ప్రాంతాల్లో గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కాలువలు శుభ్రం చేయించి, శంఖవరం, చింతలపాలెం గ్రామాల్లోని చిల్లచెట్లను, పిచ్చి చెట్లను తొలగించారు. పారిశుధ్యం, నీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకదృష్టి పెడుతున్నట్లు తెలిపారు. వార్డుల్లోని సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తామని చెప్పారు. హెల్త్ ఇన్స్‌పెక్టర్ చెన్న కేశవులు, శానటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నీరు లేక మూగజీవాల రోదన



వేములపాడులో ఏనుగు మంద వాగు ఒడ్డున నిర్మాణం ఆగిన తొట్టి



హాజీపురంలో నీటి వసతి లేని రోడ్డు వద్ద నిర్మించిన పశువుల తొట్టి

- పశువుల తొట్లకు పైసా ఇవ్వని కూటమి ప్రభుత్వం
- బిల్లులు ఎక్కాడా సార్ ? అంటున్న కాంట్రాక్టర్లు
- అల్లాడిపోతున్న మూగజీవాలు

హనుమంతునిపాడు: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా.. అధికారుల అలసత్వంతో మూగజీవాలు నీరు ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం ఆర్భాటంగా పంచాయతీల్లో మూగజీవాలకు తాగునీటి కష్టాలు లేకుండా చూడాలన్న ఉద్దేశంతో నీటి వసతి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో నీటి తొట్లు కట్టించాలని నిర్ణయించింది. అంతా బాగానే ఉన్నా.. నిధులు మాత్రం ఇవ్వడంలో విఫలమైంది. దీంతో గ్రామాల్లో తొట్ల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగాయి. ప్రతి పంచాయతీకి రెండు చొప్పున నీటి తొట్లు మంజూరయ్యాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఒక్కొక్క నీటి తొట్టి నిర్మాణాకి రూ.30 వేలతో 32 పశువుల తొట్లు మంజూరయ్యాయి. వాటిలో 24 తొట్లు నిర్మాణాలు పూర్తైనట్లు చెప్తున్నా అవి ఎక్కడా కనిపించడం లేదు. కాంట్రాక్టర్లు కొన్ని నిర్మాణాలు చేసినా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొంత మంది కాంట్రాక్టర్లు నీటి వసతి లేని చోట తొట్లు నిర్మించడంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఇప్పటికైనా అధికారులు నిర్మించిన తొట్లల్లో నీరు నింపి మూగజీవాల దాహార్తి తీర్చాలని పశుపోషకులు డిమాండ్ చేస్తున్నారు.

పీ-4 సర్వే 100 శాతం పూర్తి చేయాలి

కొండపి: అసెస్మెంట్ నీడ్ సర్వే వంద శాతం పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీ-4 కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాలను రెండు రోజుల్లో దత్తత ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. దత్తత ప్రక్రియ మార్గదర్శాలను గుర్తించి వాటన్నిటిని ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ శీలం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్

జిల్లాస్థాయి షూటింగ్ బాల్‌కు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

టంగుటూరు: జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపికకు పోటీలను గురువారం మండలంలోని జమ్ములపాలెం ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు పీడీ అశోక్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు హాజరయ్యాని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు పాకల పాఠశాల నుంచి ప్రసన్నకుమార్, చైతన్య, రామాంజనేయులు, వివేకానంద, జమ్ములపాలెం ఉన్నత పాఠశాల నుంచి అవినాష్, సుమంత్, అబ్దుల్లా, వసీం అలీ, హేమంత్, ఆల్బర్ట్ జగదీష్, ఉప్పలపాడు నుంచి కమల్,రిషి, చరణ్, సందీప్, ప్రణీత్, వెన్నూరు నుంచి నితిన్, రోహిత్, రాజు, యశ్వంత్, అశ్విత, వైష్ణవి, వైశాలి, పాకాల నుంచి అలేఖ్య, సుస్మిత, జయప్రద, జమ్ములపాలెం నుంచి లీనా, జెస్సి, భూమిక, హరిణి, ఆయేషా ఎంపికైనట్లు తెలిపారు. ఈఎంపికలలో జిల్లా షూటింగ్ బాల్ చైర్మన్ పీడీ జి మురళి జిల్లా కార్యదర్శి వెంకటేష్ కోటేశ్వరరావు చంద్రశేఖర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కందుకూరు రూరల్: శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు ఆధ్వర్యంలో దాతల సహకారంతో కందుకూరులోని అభ్యుదయ ప్రభుత్వ పాఠశాలలోని భవిత స్కూల్ విద్యార్థులకు గురువారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. చాపలు, భోజనం ప్లేట్లు, పలకలు, కూలింగ్ వాటర్ క్యాన్ అందజేశారు. అదే విధంగా కొండముడుసుపాలెం ప్రాథమిక పాఠశాలకు కూలింగ్ వాటర్ క్యాన్ అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఎన్నో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని సంస్థను కొనియాడారు. పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు కూలింగ్ వాటర్ క్యాన్లు అందజేయడం ఎంతో మంచి కార్యక్రమం అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు, పబ్బిశెట్టి పవన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానం



సీఎస్‌పురంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, టీచర్లు



మర్రిపూడిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వీరబాబు



సింగరాయికొండలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మర్రిపూడి: తల్లిముర్రుపాలు అమృతంతో సమానమని.. బిడ్డ పుట్టగానే ముర్రుపాలు పట్టిస్తే రోగనిరోధకశక్తి పెరుగుతుందని స్థానిక వైద్యాధికారి వీరబాబు సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మర్రిపూడి నడిగడ్డ సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు పౌష్టికాహారం తీసుకుంటే తల్లిపాలు బాగా వృద్ధి చెందుతాయన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలని, తల్లిపాలు పట్టించడం వల్లా తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): తల్లి నుంచి వచ్చే పాలు పసుపు రంగులో ఉన్నవి బిడ్డకు శ్రేయస్కరమని.. వ్యాధినిరోదకశక్తి బాగా ఉంటుందని అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొన్నారు. జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామ పంచాయతీలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్ విజయ, కార్యకర్తలు టి సుజాత, సిహెచ్ సుమతి, పి లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.దేవకృపావరం అన్నారు. మండలకేంద్రమైన సీఎస్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాలవారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.

కనిగిరిరూరల్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హైమావతి అన్నారు. కనిగిరి సెక్టార్ పరిధిలోని 2వ వార్డు, 1వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రజనీ, అనురాధ, మల్లేశ్వరి, రిజ్వానా, వెంకటరత్నం, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.